క్లుప్తంగా

బహిరంగ వేలం వాయిదా

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి శుక్రవారం జరగాల్సిన బహిరంగ వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు తెలిపారు. వేలంపాటలో భాగంగా రెండు కొబ్బరికాయి షాపులు, అద్దాలు, ఫొటోల షాపు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు, తలనీలాల సంబంధించి వేలంపాట శుక్రవారం నిర్వహించగా పాటదారులు లేకపోవడంతో ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పూరేటిపల్లి, దప్పళంపాడు గ్రామాల్లోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న కందుకూరు సెబ్ సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు ఎస్సై మౌలాలి సిబ్బందితో కలిసి దాడులు చేసి రెండు గ్రామాల్లోని రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోనికి తీసుకున్నారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మౌలాలి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుడ్లూరు: మండలంలోని చినలాటరఫి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. చినలాటరఫి నుంచి చిన్నపవని వరకు విద్యుత్ తీగలు కింద ఉన్న చెట్లు కొట్టి వేస్తున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని 7 గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: టంగుటూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ రూరల్ ఏఈ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. జమ్ములపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని టంగుటూరు టౌన్, జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం, జయవరం, అలాగే ఎం.నిడమానూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఎం. నిడమానూరు, కారుమంచి, మర్లపాడు, టౌన్ పరిధిలోని టంగుటూరు టోల్ ప్లాజా, తూర్పునాయుడుపాలెం, మల్లవరప్పాడు, శివపురం, సూరారెడ్డిపాలెం, వల్లూరు, వాసేపల్లిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ

కొండపి: మండలంలోని వివిధ గ్రామాల్లో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం శనివారం నుంచి పరిశీలన చేస్తుందని ఏపీఓ మహాలక్ష్మి శుక్రవారం తెలిపారు. రైతువారి కుంటలు, పూడికతీత పనులు, రోడ్ల వెంట మొక్కల పెంపకం పనులతోపాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా చేసిన 604 పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలిస్తుందని ఎస్ఆర్పీ నీలకంఠ తెలిపారు. 604 పనులకుగాను రూ.15,78,72,98,000 ఖర్చు చేసినట్లు చెప్పారు.

కిడ్నాపర్‌కు రిమాండ్

ఉలవపాడు: మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో మంగళవారం రాత్రి బాలికను కిడ్నాప్ కు ప్రయత్నించిన వ్యక్తిని గురువారం రాత్రి పోలీసులు జడ్జి ముందు హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సైత్యాగరాజు శుక్రవారం తెలిపారు. వివరాలు.. కర్నూలు కు చెందిన తిరుపాడు శీలన్న పాస్టర్‌గా పనిచేస్తూ ఉంటాడు. బయట గ్రామాలలో తిరుగుతూ ప్రార్థన చేస్తామని చెపుతూ ఇలాంటి కిడ్నాప్ యత్నాలు కూడా చేస్తుంటాడని తెలిపారు. అతని గురించి ఆరా తీయగా గతంలో కూడా ఇలా చిన్నపిల్లలను కిడ్నాప్ యత్నాలు చేసినట్లు, కేసులు నమోదు అయినట్లు తేలింది. వెంటనే ఎస్సై కేసు నమోదు చేసి జడ్జి ముందు హాజరు పరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే సర్దుబాటు

కందుకూరు: నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనల ప్రకారమే మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగిందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా విధానం ప్రకారం 3,4,5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలలో విలీనం చేశారన్నారు. ఈ నేపథ్యంలో మిగులు ఉపాధ్యాయులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే మొదట అదే కాంప్లెక్స్‌లోను, మండలంలో ఎక్కువ ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేసినట్లు తెలిపారు. వీరిలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ, బీటీఏ సంఘాల నాయకులు తోట శ్రీనివాసరావు, ఆరిబోయిన వెంకటేశ్వర్లు, గల్లా వెంకట్రావ్, కృష్ణయ్య, ఎస్‌కే అబ్దుల్లా, సూర్యనారాయణ తదితరులున్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ

కందుకూరు అర్బన్: కందుకూరు డివిజన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శీలం వెంకటేష్, విశ్వ, శీలం అరుణ వెంకటేష్, స్నేహిక, ప్రహర్షిని, నిహారిక, శామ్యూల్, ప్రిస్కిల్లా పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

• ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కోటారెడ్డినగర్‌లో ఇటీవల ప్రారంభించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ కందుకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఇప్పటికే ప్రభుత్వం అన్ని వసతులను కల్పించిందన్నారు. అందులో భాగంగా ఆధునాతన అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్కానింగ్ మిషన్ చుట్టపక్కల గర్భిణులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్కానింగ్ మిషన్‌తో పాటు అధునాతన బెడ్‌లు, ఆపరేషన్ థియేటర్ టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనేక మంది దాతల సహకారంతో కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాల, ఉలవపాడు, మాచవరం వైద్యశాలలో అధునాతన వైద్య పరికరాలు అందించామన్నారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌కు భూమిపూజ చేశామని, 3 నెలల్లో ప్రారంభించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలందుతున్నాయని చెప్పారు.



అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుర్చీలు, టేబుల్స్ బహూకరణ..

కందుకూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ప్రారంభం సందర్భంగా దివ,గత జరుగుమల్లి నరసింహం ధర్మపత్ని సుబ్బులు జ్ఞాపకార్థం వారి మనవళ్లు సతీష్, మనోజ్‌లు రూ.25వేల విలువైన టేబుల్స్‌ను కుర్చీలను ఎమ్మెల్యే చేతుల మీదుగా వైద్యశాలకు బహుకరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రియంవద, మాచవరం డాక్టర్ స్వాతి, డాక్టర్ శర్మిష్టారెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

పామూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని దూబగుంట్లలో శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దూబగుంట్ల మాజీ సర్పంచ్ మితికాల గురుస్వామి, పలుకుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరగా వారిని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. పార్టీలో చేరిన గురుస్వామి, పలువురు మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్ సీపీ భారీ మెజారిటీకి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, బుక్కాపురం సర్పంచ్ ఎం గోవర్ధన రాధాక్రిష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ చెనికల శ్రీను, బద్దిపూడి మార్కు, ఎర్రపురెడ్డి, చప్పిడి అజయ్, నీలం వెంకటేశ్వర్లు, వనిపెంట సింహాద్రి పాల్గొన్నారు.

నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలి

వెలిగండ్ల: మినుము, కంది పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం, పంట ఇన్సూరెన్స్ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రామన మహాలక్ష్మి అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామన మహాలక్ష్మి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీపై అందించాలన్నారు. స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఇప్పటి వరకు సరఫరా చేయలేదని, అధికారులు వెంటనే సరఫరా చేయాలన్నారు. ఏడీఏ ఈవీ రమణ మాట్లాడుతూ రబీలో ఈ–క్రాప్ చేసుకున్న రైతులంతా ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్ రంగకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మండల నాయకులు వై నాగూర్‌యాదవ్, కె వెంకటరామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సీఎస్‌పురం: ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని చెర్లోపల్లిలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఉత్తర్వులతో మారుమూల ప్రాంత గ్రామాల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం 30 మందికి ఆధార్ సేవలు అందజేసినట్లు తెలిపారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కదిరి

సీఎస్‌పురం: మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు శుక్రవారం కోవిలంపాడులోని మృతుని గృహానికి వెళ్లి మృతుని కుమారుడు మహబూబ్ బాషాను పరామర్శించారు. ఈయన వెంట షేక్ పెద్దఖాజావలి, షేక్ ఖాజావలి, షేక్ షరీఫ్, గోను రాజశేఖరరెడ్డి, గోను సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న కదిరి బాబూరావు

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం

పామూరు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు, త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో లబ్ధి పొందేందుకు ఆయా రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌పై సవతి ప్రేమ చూపించిందన్నారు. పెట్టుబడి దారులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా అమ్మివేస్తున్నదన్నారు. అక్రమాలకు పాల్పడ్డ అదానీ ఆస్తులను జప్తు చేయాలని, లేకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, మండ కార్యదర్శి పోతల ప్రభాకర్, సహాయ కార్యదర్శులు మస్తాన్‌రావు, రాగిపాటి సూరిబాబు, నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్‌మౌలాలి

గ్రానైట్ టిప్పర్ బోల్తా

గుడ్లూరు: గ్రానైట్ టిప్పర్ అదుపు బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని చేవూరులో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చీమకుర్తి నుంచి గ్రానైట్ రాళ్ల తీసుకొని రామాయపట్నం పోర్టుకు వెళుతున్న టిప్పర్ చేవూరు రహదారిలోకి వచ్చే సరికి ముందు వస్తున్న టిప్పర్‌కు దారి ఇవ్వడానికి రోడ్డు మార్జిన్ దిగడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా కొట్టింది. అందులో నుంచి డ్రైవర్ క్షేమంగా బయటకు వచ్చాడు. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

• జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ

టంగుటూరు: ప్రజలు తమ ఇళ్లే కాదు పరిసరాలను కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆమె టంగుటూరు 3వ సచివాలయం పరిధిలోని వడ్డెపాలెంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో చెత్త, మురుగు నిల్వలేకుండా చూసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉన్న చోట ఎబేట్ పిచికారీ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిల్లలతో నేరుగా మాట్లాడి వారికి కలుగుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప మలేరియా అధికారి వి.నాగార్జున సబ్ యూనిట్ అధికారి ఐ.సాగర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రసాద్‌బాబు, సీహెచ్‌ఓ వెంకటేశులు, ఏఎన్‌ఎం ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ

మిరపలో అధిక నత్రజని వాడకూడదు

కొండపి: మిరప పంటలో అధికంగా నత్రజని ఎరువులు వాడకూడదని ఒంగోలు ఉద్యానవనశాఖ అధికారిణి డి.ప్రత్యూష రైతులకు సూచించారు. కొండపి పంచాయతీలో రైతులు సాగు చేసిన మిరప తోటలను శుక్రవారం ఆమె పరిశీలించి రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అధిక నత్రజని ఎరువులు వాడకుండా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సూక్ష్మధాతు లోపాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. సల్ఫేట్ రూపంలో నత్రజని అందించాలన్నారు. పురుగు మందు పిచికారీ చేసేటప్పుడు మొక్క అన్ని భాగాలు తడిసేలా చేయాలని సూచించారు. మిరపలో తెగుళ్లు, పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు టి.వెంకట నారాయణ, పి.భరత్‌కుమార్, ఎంపీఏఓ సుజాత, రైతులు పాల్గొన్నారు.



కొండపిలో మిరప తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి ప్రత్యూష

ఎల్ఐసీ ఏజెంట్లకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జహంగీర్‌సుల్తాన్

కందుకూరు: స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం ఎల్ఐసీ ఏజెంట్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు రమేష్ సంఘమిత్ర హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ జహంగీర్ సుల్తాన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు, వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందచేయాలి ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. మండలంలోని చాకిరాల అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందచేసే పథకాల్లో, పౌష్టికాహారం పంపిణీలో నిజాయితీగా వ్యవహరించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి తగు సూచనలు, ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సంగీతలక్ష్మి, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మర్రిపూడి: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డి ఆకాంక్షించారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫేర్వెల్ ఫంక్షన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్రిపూడిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, ఉత్తీర్ణత శాతంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.కోటయ్య మాట్లాడుతూ.. కళాశాలకు రెండు ఎకరాలు దానం చేసిన మాజీ సర్పంచ్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి మరింత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కోటయ్య

100 మంది రక్తదానం



దేవీ సీ ఫుడ్స్‌లో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండలోని దేవీ సీ ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పొట్రు బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీలో పని చేసే ఉద్యోగులు 100 మంది రక్తదానం చేశారు. రక్తదానాన్ని ప్రోత్సహించిన దేవీ సీ ఫుడ్స్ యాజమాన్యానికి రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ ప్రశంస పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చెర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు బీవీ రెడ్డి, ప్రసన్న రాజు, మెడికల్ ఆఫీసర్ కృష్ణారావు, జిల్లా కోఆర్డినేటర్లు శ్రీనివాస్, స్టాంటిన్, టెక్నీషియన్లు రవి, వెంకటేశ్వర్లు, రాజకుమార్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం అందజేత

టంగుటూరు: సింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన బత్తుల శివారెడ్డికి వినికిడి యంత్రాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు అందజేశారు. ఆయన సమస్యను స్థానిక నాయకులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు దృష్టికి తీసుకురాగా జిల్లా అధికారులతో మాట్లాడి వినికిడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీసీడీ ఉదయకుమార్, ఏఎంసీ డైరెక్టర్ టంగుటూరి రామకృష్ణ, మన్నం వెంకయ్య, నన్నూరి వెంకటేశ్వర్లు, కొమ్ము బుజ్జి, రవి, పాకల శ్రీను, ఏసు తదితరులు పాల్గొన్నారు.



వినికిడి యంత్రం అందజేస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు

వెట్టి చాకిరిని నిర్మూలిద్దాం



ఇటుక బట్టీల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కనిగిరి రూరల్: వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమలులో అందరూ భాగస్వామ్యులు కావాలని ఎస్సై దాసరి ప్రసాద్ అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన దినం పురస్కరించుకుని పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వం వెట్టి చాకిరి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. ఇటుక బట్టీలు, దుకాణాలు, వ్యాపార సంస్థల వారికి వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా ఉంటుందన్నారు. అసిస్టెంట్ లేబర్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆర్టికల్ 24 ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో ఎవరూ పెట్టుకున్నా శిక్షార్హులవుతారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి, పారాలీగల్ వాలంటీర్ మంద్రు రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి రూరల్: ఉపాధిహామీ పథకం పనులను గ్రామాల్లోని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన ఇర్లపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామానికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కూలీలకు పనికి తగ్గ వేతనం పడే విధంగా పనులు చేయించాలన్నారు. ప్రతి కూలీకి రూ.257 గిట్టుబాటు అయ్యే విధంగా కూలీలు పనులు చేయాలని తెలిపారు. ఉపాధి కూలీలకు ప్రమాద సమయంలో ఉపయోగ పడే మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ, టీఏ,, ఎఫ్‌లు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

పీసీపల్లి: అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని నేరేడుపల్లిలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న షేక్ కరిముల్లాను హెచ్‌సీబీ గోవిందరాజు, పీసీ పి వెంకటేశ్వర్లు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఎస్సై నాగేశ్వరరావు అప్పగించి కేసు నమోదు చేశారు. కనిగిరి కోర్టులో ప్రవేశపెట్టగా నిందితుడికి 14రోజులు రిమాండ్ విధించారు.

15 నుంచి వల్లూరులో ధాన్యం కొనుగోలు

టంగుటూరు: వల్లూరు రైతు భరోసా కేంద్రంలో 15వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రారంభం అవుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్ మాట్లాడుతూ.. ఈ క్రాప్, ఈకేవైసీ 15వ తేదీలోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఓ స్వర్ణలత మాట్లాడుతూ.. 2022–23 రబీ సీజన్లో సాగు చేసిన పంటల వివరాలు ఈ క్రాప్‌లో నమోదు చేయాలని వీఏఏలు, వీఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి, వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరు వ్యవసాయ మండలి సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రహరీ, భవన నిర్మాణ మరమ్మతులు చేసేందుకు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎస్.సుదీప శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రహరీ, సమావేశ మందిరం విస్తరణ, లెవెలింగ్ తదితర మరమ్మతులు చేపట్టేందుకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎస్‌కే ఖాశింపీరా, ఈఓఆర్డీ నాగూర్ వలి, కోఆర్షన్ సభ్యులు కోండ్రు ఇజ్రాయిల్, మాచేపల్లి నాగయ్య, తూగుట్ల నర్సారెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ